సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం ; 5, మే, 2024

నీటిని ఒడిసిపట్టేదెలా?



వర్షపునీరు వృథా పోకుండా భవన నిర్మాణం చేపట్టే సమయంలో ఇంకుడు గుంత నిర్మించాలని ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు.

IIIలో ▸

రాహుల్ సభ జయప్రదం చేయండి

బోథ్: ఈ నెల 5న నిర్మల్‌లో తలపెట్టిన రాహుల్ గాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ కోరారు. శనివారం సొనాలలో విలేకరులతో మాట్లాడుతూ, బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
43.0 /29.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు కాగజ్‌నగర్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కాగజ్‌నగర్ పట్టణానికి కేంద్రహోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఆదివారం రానున్నారు. మధ్యాహ్నం 3.20గంటలకు పట్టణంలోని ఎస్పీఎం గ్రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి గో డం నగేష్‌కు మద్దతుగా జరిగే ఎన్నికల ప్రచా ర బహిరంగ సభలో పాల్గొంటారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సభ ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించారు. బహిరంగ స భకు కేంద్ర భద్రత సిబ్బందితోపాటు జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ ప ట్టణంలో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

నేడు నిర్మల్‌కు రాహుల్‌గాంధీ రాక

నిర్మల్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం జిల్లా కేంద్రం నిర్మల్‌కు రానున్నారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ప్రచారం చేయడానికి వస్తున్నారు. నిర్మల్ కలెక్టరేట్ రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 11 గంటలకు రాహుల్‌గాంధీ సభాప్రాంగణానికి చేరుకుంటారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఢిల్లీ నుంచి నాందేడ్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నిర్మల్‌కు రానున్నారు. బహిరంగసభ విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణులు శ్రమిస్తున్నాయి. దాదాపు 65వేల మంది జన సమీకరణ లక్ష్యంగాపనిచేస్తున్నాయి. ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రేఖానాయక్ తదితరులు జనసమీకరణ, సభ విజయవంతానికి కృషి చేస్తున్నారు.

కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన



కమిషనింగ్ ప్రక్రియ పరిశీలిస్తున్న రాజర్షిషా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో చేపట్టిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా శనివారం పరిశీలించారు. ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లలో బ్యాలెట్ పేపర్, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను పరిశీలించారు. ఈనెల 13న నిర్వహించనున్న పోలింగ్ కోసం ఈవీఎంలను అన్ని విధాలుగా సిద్ధం చేయాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లే బస్సుల వేళల్లో మార్పు

ఎదులాపురం: ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆయా ఆర్టీసీ బస్సుల వేళల్లో మార్పు చేసినట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. లహరి బస్సులు ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 01.15, రాత్రి 09.30, 10.30 గంటలకు, సూపర్ లగ్జరీ బస్సులు ఉదయం 4.00, 4.50, 5.40, 7.45, 8.35, 9.30, 10.50 గంటల వరకు, మధ్యాహ్నం 01.50, సాయంత్రం 04.10, 06.50, రాత్రి 08.55, 09.50, 11.00, 11.30 గంటలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణకు హాజరైన క్రీడాకారులు

నేరడిగొండ: క్రీడాకారులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర క్రీడల సంస్థ, జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఉచిత సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ శిక్షణ నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆరుషి, అక్షితను సన్మానించారు. ఇందులో శిక్షకుడు గస్కంటి గంగాధర్, సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రెటరీ నాగరాజు, నెట్‌బాల్ సెక్రెటరీ ఎ.మోహన్, ఎన్ఐఎస్ కోచ్ అఖిల, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మిక క్షేత్రంలో కేసీఆర్ జోష్



జనసంద్రంగా మారిన మంచిర్యాల ఐబీ చౌరస్తా



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

- జనసంద్రంగా ఐబీ చౌరస్తా
- మంచిర్యాలలో రోడ్‌షో

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్మిక క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ శనివారం నిర్వహించిన రోడ్డు షో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో పట్టణంలోని ఐబీ చౌరస్తా జనసంద్రంగా మారింది. కేసీఆర్ రాత్రి 8.40గంటలకు మంచిర్యాలకు బస్సులో చేరుకోగా డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. బస్సుపై నుంచే కేసీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగాన్ని ప్రారంభించగానే 'సీఎం.. సీఎం.. సీఎం' అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున నినాదాలు వస్తుండడంతో, ప్రజలు నిశ్శబ్దంగా ఉండాలంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బస్సు పైనుంచే కోరారు.

ప్రజల నుంచే సమాధానాలు రాబట్టి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ అయిందా, రైతుబంధు వచ్చిందా, మహిళలకు ప్రతినెలా రూ.2,500 వచ్చాయా అంటూ సమాధానాలు రాబట్టారు. మంచిర్యాలలోని మహిళలకు రూ.5 వేలు వస్తున్నాయంట కదా అంటూ చమత్కరించారు. కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తలేదా, కరెంటు పోతుందా, కరెంటు కోతలు మొదలైనాయా అంటూ ప్రజలను అడగడంతో.. అవేమీ వస్తలేవంటూ ప్రజలు చేతులను అడ్డంగా ఊపుతూ సమాధానం ఇచ్చారు. అందరికీ వస్తున్నాయని, కేవలం మంచిర్యాల ప్రజలకే వస్తలేవా అంటూ ప్రజల్లో జోష్ నింపారు.

మొండిగోడలను చూపిస్తూ...

మంచిర్యాలలోని ఐబీ ఆవరణలో గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని చూపిస్తూ మధ్యలోనే నిలిచి మొండి గోడలతో కనిపిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంచిర్యాల ప్రజలకు వద్దా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తాము ప్రారంభిస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్మాణాన్ని ఆపేసిందని, ఆ భవనం మొండి గోడలే కనిపిస్తున్నాయని అన్నారు.

మీ జిల్లాను రద్దు చేస్తారంటా...

పాత ఆదిలాబాద్, కొత్త మంచిర్యాలలో తాను నిలబడి మాట్లాడుతున్నానని, పాత ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజల సౌకర్యం కోసం మూడు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకుంటే, సీఎం రేవంత్ మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలను రద్దు చేస్తానని అంటున్నాడని కేసీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా ఉండాల్నా.. పోవాల్నా అని ప్రజలను అడగ్గా, ఉండాలని ప్రజలు అనడంతో, ఇది మంచిర్యాల జిల్లా ప్రజల మాటనా అంటూ, మంచిర్యాల జిల్లా ఉండాలంటే కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మంచిర్యాల జిల్లా ఉండాలనుకునే వారు బీఆర్ఎస్‌ను గెలిపించాలని, వద్దనుకుంటే ఓడగొట్టాలని అన్నారు.



మహిళలతో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, సుమన్ కరచాలనం

శ్రీమంతుడికి, కార్మికుడికి పోటీ

పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తుంది ఆగర్భ శ్రీమంతుడని, బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తుంది భూగర్భ కార్మికుడు అని కేసీఆర్ అభివర్ణించారు. 26 ఏళ్ల సింగరేణిలో తట్టమోసిన కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేస్తారా, పుట్టుకతోనే శ్రీమంతుడైన వ్యక్తికి ఓటు వేస్తారాని ప్రజలను ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, సీఎం రేవంత్ ఆదానీని కలిశారని, సింగరేణి ప్రైవేటీకరణ అడ్డుకోవాలన్నా, కార్మికులకు న్యాయం జరగాలన్నా కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా మంచిర్యాల జిల్లా ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. 44, 45 డిగ్రీల ఎండ ఉన్నా మంచిర్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ చౌరస్తా ఈనిండా అనేలా ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారని, ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపి ప్రసంగాన్ని 17 నిమిషాల్లో ముగించారు. కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు దాదాపుగా మూడు గంటలకు పైగా ఐబీ చౌరస్తాలో వేచి చూశారు. కేసీఆర్ ప్రసంగాన్ని ముగించి బస్సు వెళ్లే వరకు అక్కడే ఉండి తిరిగి ఇళ్లకు వెళ్లారు. కేసీఆర్ ప్రసంగంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేసీఆర్ తిరుగు ప్రయాణంలో ఇందారం గోదావరి నది వద్ద పూజలు చేసి వెళ్లారు.



హాజరైన సింగరేణి కార్మికులు, నాయకులు



పథకాలు వస్తలేవంటూ చేతులూపుతున్న జనం

ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. ఓటింగ్ సరళిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఈసీ నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులంతా ఈ నెల 8 వరకు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు జీఎస్ ఎస్టేట్‌లోని ఓ నివాసానికి వెళ్లి హోంఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

బోథ్: పోస్టల్ బ్యాలెట్, హోంఓటింగ్ ప్రక్రి య కొనసాగుతోంది. శుక్రవారం ప్రారంభమైన ఓటింగ్ ఈ నెల 8వ తేదీతో ముగుస్తుంది. శనివారం బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా 166 మంది ఉద్యోగులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోంఓటింగ్ ద్వారా 110 మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్రాంతినగర్‌లో అనుమతి లేకుండా రోడ్డు పక్కన ఒక మతానికి సంబంధించిన జెండా గద్దెను నిర్మించారన్నారు. వాటికి సంబంధించి ఎలాంటి అనుమతి లేవని మున్సిపల్ అధికారులు రోడ్డుకు ప్రమాదకరంగా ఉందని తీసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జరిగిన ఘటనలో ఓ వర్గం వ్యక్తులు గుమిగూడి, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా నినాదాలు చేశారు. ప్రతి చర్యగా మరో వర్గానికి సంబంధించిన వ్యక్తులు నినాదాలు చేయగా ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎలాంటి జెండాలైనా, విగ్రహాల ఏర్పాటుకైనా సంబంధిత శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా గుమిగూడినా, ఎటువంటి ర్యాలీలు, సభలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

- మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి

ఆదిలాబాద్‌టౌన్: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. జాగో తెలంగాణ ఆధ్వర్యంలో బీజేపీని ఓడించాలనే నినాదంతో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. యాత్రకు స్థానిక కార్మిక, ప్రజా సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం నేతాజీచౌక్‌లోని కార్మికుల అడ్డావద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షకులు, ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. గడిచిన పదేళ్లలో జిల్లా అభివృద్ధికి కేంద్రం చేసిందేమీ లేదన్నారు. సీసీఐని తెరిపించలేదని, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్‌కు ఎలాంటి నిధులు కేటాయించలేదని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపలేదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

మరోసారి మోదీనే ప్రధాని

- ఓటమి భయంతోనే రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు మదన్‌సింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు తన పనితీరుతో భారతదేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటిన నరేంద్రమోదీ మరోసారి ప్రధానిగా కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు మదన్‌సింగ్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పంచవటి హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా మూడుసార్లు మద్దతు ధరలను పెంచినట్లు గుర్తు చేశారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేలా ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ముద్ర రుణాలు అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రధాని మోదీ హయాంలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. 400 ఎంపీ సీట్లతో మరోసారి కేంద్రంలో మోదీ సర్కారు ఏర్పడబోతుందన్నారు. దీన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా తమ వైపు ఉన్నారని, అబద్దాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌కు వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదని కొత్త, పాత క్యాడర్ కలిసి తమ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని కాంగ్రెస్ చేసే ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదన్నారు. సమావేశంలో రాజస్తాన్ ఎమ్మెల్యే గోవర్ధన్‌వర్మ, నాయకులు వి.ఆదినాథ్, లాలామున్నా, గటిక క్రాంతి, మోహన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మదన్‌సింగ్ రాథోడ్

మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా..

- సుగుణను గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క

ఆదిలాబాద్‌రూరల్: 'నేను మీ జిల్లా ఇన్‌చార్జి మంత్రిని.. మీరెదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి..' అని మంత్రి సీతక్క అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బంగారుగూడ, యాపల్‌గూడ, అంకోలి, పిప్పల్‌ధరి గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. రోడ్‌షోతో పాటు ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇండ్లిచ్చిందా, భూములిచ్చిందా, ఉద్యోగాలిచ్చిందా అని ప్రశ్నించారు. దేవుడి పేరుతో ఆ పార్టీ రాజకీయం చేస్తుందని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్‌అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీపీ ఆశమ్మ, మాజీ జెడ్పీటీసీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో న్యాయవాదుల చేరిక

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ బాధ్యులతో పాటు పలువురు న్యాయవాదులు శనివారం ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సుగుణతో కలిసి మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఏ.సంతోష్‌కుమార్, ముజాహిద్ హుస్సేన్, మధుకర్, సంజయ్‌కుమార్, డి.నాగేశ్వర్, డిఎస్పి శర్మ, టి.వెంకట్ కుమార్, షేక్ మన్సీర్, రవీందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపును కాంక్షిస్తూ మండల కేంద్రంలో శనివారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కుంటాల జలపాతం అభివృద్ధితో పాటు కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణం అయ్యేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు అందజేస్తామని తెలిపారు. మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ, కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నాయకులు కోటేష్, అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఆడే వసంత్ రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, పోతారెడ్డి, సంజీవ్ కుమార్, వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు పొచ్చెర, కౌఠ బి, సొనాల గ్రామాల్లో మంత్రి సీతక్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపిస్తే బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కార్యాలయాలకు భవనాలు మంజూరు, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, ఎంపీటీసీ రజియా బేగం, చంటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యాపల్‌గూడలో ఇంటింటా ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి సీతక్క

కాల్ చేయండి.. కథలు వినండి

- 040-45209722కు డయల్ చేస్తే చాలు.. ఆనందం కలిగించే కథలెన్నో
- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వేసవి సెలవుల్లో విద్యార్థులు 040-45209722 నంబర్‌కు డయల్ చేసి ఆసక్తి, ఆనందం కలిగించే వివిధ కథలను హాయిగా వినవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రూమ్ టు రీడ్ కార్యక్రమంలో భాగంగా వినిపించే కథలతో కూడిన పోస్టర్‌ను శనివారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందించడం ద్వారా వారిలో మౌఖిక భాష వికాస అభివృద్ధి , అభ్యసన సామర్థ్యాలను సాధించవచ్చన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులలో అభ్యసన కొనసాగింపు కోసం రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ నంబర్‌ను రూపొందించిందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ కథలను వినిపించడం ద్వారా వారి వికాసానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ డయల్ నంబర్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఏఎంవో శ్రీకాంత్‌గౌడ్, సెక్టోరియల్ అధికారి జే. నారాయణ, సొహైల్, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

క్లుప్తంగా

బైక్‌పై వెళ్లి.. ఓట్లు అభ్యర్థించి..



బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. అందాకూర్‌లో ఉపాధిహామీ కూలీల వద్దకు బైక్‌పై వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఓలాలో ఉపాధి కూలీలతో కలిసి అల్పాహారం తిన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

మహారాష్ట్ర మద్యం పట్టివేత



మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

భైంసాటౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని భైంసా ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎంఏ రజాక్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి తెలిపారు. కుభీర్ మండలం చాత ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపడుతుండగా, మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన పరశురాం స్కార్పియో వాహనంలో 48 దేశీదారు క్వార్టర్లు, నాలుగు లీటర్ల మహారాష్ట్ర మద్యం లభించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో భైంసా ఎక్సైజ్ ఎస్సైలు గజేందర్, నిర్మల, హెడ్ కానిస్టేబుల్ అశ్వాక్, సందీప్, శైలేశ్, నిజాం, అశోక్, రవి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాఘాపూర్ గ్రామంలో బెల్టు షాపుపై పోలీసులు శనివారం దాడి చేశారు. గ్రామానికి చెందిన బండి దేవన్న బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి రూ.20వేల విలువ గల 17లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కేసు నమోదు చేసి అతడిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

అర్ధరాత్రి మంత్రి వాహనం తనిఖీ



మంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్: కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పాతతర్లపాడ్ గ్రామానికి గురువారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో వెళ్తున్న మంత్రి సీతక్క వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని తర్లపాడ్ చౌరస్తాలో పెట్రోల్‌బంక్ వద్ద మంత్రి వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో ఆపారు. అనంతరం కారు తనిఖీ చేశారు. మంత్రి వాహనంతో పాటు అక్కడే ఉన్న ఇతర వాహనాలను అధికారులు తనిఖీ చేసి పంపించారు.

ఈవీఎంలు సిద్ధం

- రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి
- నియోజకవర్గాల వారీగా బీయూ, సీయూ, వీవీ ప్యాట్స్ కేటాయింపు
- ఇంజినీర్ల ఆధ్వర్యంలో కమిషనింగ్ ప్రక్రియ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లు పోలింగ్‌కు సిద్ధమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గోదాం నుంచి ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించిన అధికారులు అక్కడి స్ట్రాంగ్ రూముల్లో వాటిని భద్రపరిచారు. వాటి తొలివిడత ర్యాండమైజేషన్‌ను గత నెల 3న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టిన అధికారులు నియోజకవర్గాల వారీగా అవసరమైన ఈవీఎంలను తరలించారు. తాజాగా ఈ నెల 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ సైతం పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్రవిజయ్, పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి రాజర్షి షా సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై వాటి వివరాలు ప్రదర్శించి రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. ఏడు నియోజకవర్గాలకు కేటాయించిన వాటి జాబితాతో కూడిన వివరాలను వారికి అందజేశారు. ప్రస్తుతం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈసీఐఎల్ నుంచి వచ్చిన ఇంజినీర్లు బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని కలెక్టర్లు నిర్దేశించిన ప్రదేశాల్లో ఈవీఎంల్లో బ్యాలెట్‌ను నిక్షిప్తం చేస్తున్నారు. ప్రత్యేక భద్రత నడుమ ఈ ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్‌కు సిద్ధం చేయనున్నారు.

25శాతం రిజర్వులో ...


ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా వాటి పరిధిలో మొత్తం 2,200 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటికి గాను 2,771 బ్యాలెట్ యూనిట్స్ 2,771 కంట్రోల్ యూనిట్స్, 2,977 వీవీ ప్యాట్స్‌ను కేటాయించారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే పోలింగ్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఉండేలా బీయూ, సీయూలను 25శాతం అదనంగా కేటాయించారు. వీవీ ప్యాట్స్‌ను 35శాతం అదనంగా రిజర్వులో ఉంచారు. ఈ నియోకవర్గ పరిధిలో 12 మంది అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండటంతో ఒకే ఈవీఎంతో ఎన్నికలు నిర్వహించనున్నారు.

నియోజకవర్గ పరిధిలో ఈవీఎంల కేటాయింపు వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	బీయూ	సీయూ	వీవీప్యాట్స్
సిర్పూర్	320	412	412	423
ఆసిఫాబాద్	356	456	456	471
ఖానాపూర్	309	385	385	415
ఆదిలాబాద్	292	365	365	408
బోథ్	306	383	383	428
నిర్మల్	306	382	382	413
ముధోల్	311	388	388	419

రారండోయ్ వేడుక చేద్దాం

- వైరల్ అవుతున్న ఆహ్వాన పత్రిక
- ఓట్ల పండుగకు ఇన్విటేషన్‌కార్డు
- సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు



ప్రసారమాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఆహ్వానపత్రిక ఇదే..

నిర్మల్‌ఖిల్లా: వివాహాలు, శుభకార్యాలు లేనేలేవు.. ఇప్పుడేంటి ఆహ్వానం.. అని ఆశ్చర్యపోతున్నారా.. అవును ఇది ఆహ్వానపత్రికే.. ఐదేళ్లకోసారి ప్రజాస్వామ్య పండుగ కోసం జరుగుతున్న ఎన్నికల పోలింగ్ కోసం ఆహ్వానం. 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ హృదయపూర్వక ఆహ్వానం అంటూ.. సకుటుంబ సమేతంగా స్వాగతం పలుకుతున్న ఆహ్వాన పత్రిక నిర్మల్ జిల్లాలో వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. పోలింగ్ రోజైన ఈ నెల 13న ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు అర్హత కలిగిన ప్రతీ ఓటరు కుటుంబ సమేతంగా వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరుతూ ఆహ్వాన పత్రికలో ముద్రించబడి ఉంది. ఎన్నికల కమిషన్ లోగో, నాలుగు సింహాల రాజముద్రతో రూపొందించబడిన ఈ కార్డులో సమీప పోలింగ్ కేంద్రాన్ని కార్యస్థలంగా పేర్కొన్నారు. ఇక ప్రజాస్వామ్య జీవితంలో ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగ ప్రజాస్వామ్య ఫలాలను పొందేలా చేస్తుందని, అదే విందుగా భావించాలని పేర్కొనడం కొసమెరుపు. ఇక వచ్చేటప్పుడు సంబంధిత ఎన్నికల కమిషన్ పేర్కొన్న గుర్తింపు కార్డు తీసుకువచ్చిన వారికి ప్రవేశం ఉంటుందని ఇందులో సృజనాత్మకంగా పేర్కొనడం గమనార్హం. ఇక చివరన ఈ ఇన్విటేషన్ కార్డును ప్రజాచైతన్యం కోసం.. అభిరుచి మేరకు రూపొందించబడిందని ఇందులో తెలపడం విశేషం.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



బావాపూర్(కే)లో మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఆరోపించారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో గల కరీం కాలనీతో పాటు మండలంలోని దిలావర్‌పూర్, బావాపూర్(కే), కొత్తపేట్, పాతతర్లపాడ్ గ్రామాల్లో రాత్రి 9 నుంచి 12గంటల వరకు ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ ఉపసర్పంచులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన దిలావార్‌పూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరిగొండ మల్లయ్య, కొత్తపేట మాజీ సర్పంచ్ కాసవేణి సునీత రాజన్న, పాతతర్లపాడ్ మాజీ ఉపసర్పంచ్ బొంత చిన్నబాపుతో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులకు మంత్రి కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, నాయకులు దయానంద్, సత్యం, షబ్బీర్‌పాషా, రమేశ్, సంతోష్, మాజిద్, శంకర్, లక్ష్మీపతి, రాంనారాయణ, సురేశ్, సతీశ్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేశ్, గంగాధర్, పీ శ్రీనివాస్, అశోక్, జహీర్ అహ్మద్, సచిన్ తదితరులున్నారు.

సుగుణకే ఆదివాసీల మద్దతు

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



మాట్లాడుతున్న సచిన్

ఎదులాపురం: ఆదివాసీల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకే ఆదివాసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల అభ్యున్నతికి బీజేపీ చేసింది శూన్యమన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి సుగుణ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు, కుమురం భీం జిల్లా అధ్యక్షుడు మాలశ్రీ, ఉపాధ్యక్షుడు మేస్రం మహేశ్, ఈశ్వర్, నర్మద, శకుంతల, సహాయ కార్యదర్శులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై రాము

బోథ్: ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.3లక్షల నగదును మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఎస్‌టీం సభ్యులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై రాము తెలిపిన ప్రకారం వివరాలు.. మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా కుర్హ గ్రామానికి చెందిన అంకూస్ కారులో నగదుతో వెళుతుండగా ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఎస్‌టీం తనిఖీ చేసింది. ఈ క్రమంలో రూ.3లక్షల నగదు లభించగా సీజ్ చేసి బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎస్‌ఎస్‌టీ టీం సభ్యులు శ్రీనివాస్, ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుల్ మోహన్ ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్ కు చెందిన ఫారూక్‌ఖాన్, సోహిల్‌ఖాన్‌పై టు టౌన్‌లో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. క్రాంతినగర్ ఆటోస్టాండ్ వద్ద ఉన్న రెపరెపలాడుతున్న కాషాయ జెండాను దారంతో చుట్టారని తిలక్‌నగర్‌కు చెందిన రాకేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పైడిపల్లి రవీందర్‌రావు రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న రవీందర్‌రావు

ఖానాపూర్: ఏపీపీఎస్సీ మాజీ మెంబర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పైడిపల్లి రవీందర్‌రావు శనివారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ బాధ్యుల అనుచిత వైఖరి, నిర్లక్ష్య ధోరణికి నిరసనగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముఖ్యనాయకులు, అనుచరవర్గంతో కలిసి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్‌లో అయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎంతోమంది గిరిజన నాయకులు ఉన్నప్పటికీ పార్టీ అధిష్టానం పదేపదే ప్యారాచూట్ నేతలను దింపి ఓటమి పాలవుతోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ సమావేశాలకూ ఆహ్వానించకుండా పార్టీ నేతలు గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏళ్లుగా జిల్లాలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ అభ్యర్థికి ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ కారింగుల విజయరాములు, కడెం మాజీ ఎంపీపీ సుధాకర్‌రావు, జన్నారం వైల్డ్ లైఫ్ వార్డెన్ జెల్ల భీమయ్య, నాయకులు కొత్తపెల్లి సురేశ్‌కుమార్, కొండాడి గంగారావు, కే శ్రీనివాస్‌రావు, ఏ సంజీవ్‌రావు, జీ నర్సయ్య తదితరులున్నారు.

ప్రజాస్వామ్యవాదులు గౌరవించేలా హైకోర్టు తీర్పు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యవాదులు గౌరవించేలా ఉందని సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ప్రమేయం లేకుండా తన సంతకం ఫోర్జరీ చేశారని ఆరోపించారు. ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించేలా గత ప్రభుత్వ పెద్దలు, అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా తన అభ్యర్థిత్వాన్ని విత్‌డ్రా చేసుకున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. న్యాయం కోసం దీనిపై హైకోర్టులో పిటిషన్ వేసినట్లు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఏర్పడేలా నేడు కోర్టు తీర్పు వెలువడిందని వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ గ్రామానికి చెందిన జానకిరామ్ అనే వ్యవసాయ కూలీ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో శనివారం ఉదయం దగ్ధమైంది. దీంతో ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.7లక్షల వరకు నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే ఇంట్లోని పిల్లల సర్టిఫికెట్లు, ఇతర త్రావి కూడా అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం అందించారు. విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానని గజేందర్ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



అబ్దుల్ ఖదీర్ (ఫైల్)

దిలావర్‌పూర్: మండల కేంద్రం నుంచి బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానికుడు షేక్ అబ్దుల్ ఖదీర్ (54) మృతి చెందాడు. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అబ్దుల్ ఖదీర్ దిలావర్‌పూర్‌లోని తన ఇంటి నుంచి బస్టాండ్ వైపు మోపెడ్‌పై వెళ్తుండగా ఇదే గ్రామానికి చెందిన ఎడ్దెన్నోళ్ల రవి ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఖదీర్ తల, ముక్కుకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో కామారెడ్డి వద్ద మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులకు వాగ్వాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఓ ఆర్టీసీ అద్దె బస్ డ్రైవర్, ప్రయాణికులకు వాగ్వాదం జరిగింది. భైంసా డిపోకు చెందిన బస్సు నిర్మల్‌కు వెళ్లే స్టేజీ వద్దకు చేరుకున్న క్రమంలో సీటు కోసం ప్రయాణికులు ఎగబడగా, డ్రైవర్ వారించాడు. దీంతో ఈ విషయమై ప్రయాణికులతో వాగ్వాదం జరిగింది. దీంతో డ్రైవర్ ఎస్‌కే మూసా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

క్షణికావేశం.. ఇద్దరు మహిళల ప్రాణం తీసింది!

- భార్యాభర్తల గొడవతో భార్య ఆత్మహత్య
- కారణమని దూషించడంతో మరో మహిళ బలవన్మరణం



రమ మృతదేహం

సిర్పూర్(టి): క్షణికావేశం ఇద్దరు మహిళల ప్రాణాలు తీసింది. భార్యాభర్తల మధ్య గొడవతో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణమంటూ ఆమె భర్త కుటుంబ సభ్యులు దూషించడంతో ఎదురింట్లో ఉండే మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బెస్తకాలనీకి చెందిన గాజిరెడ్డి రమ(35)ను భర్త గాజిరెడ్డి సురేష్ గత కొంతకాలంగా అనుమానంతో వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో రమ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందింది.

ఆత్మహత్యకు కారణమంటూ..

ఇదే కాలనీలో దోని సరిత(30) రమ ఎదురు ఇంట్లో నివాసం ఉంటుంది. రమ, సరిత ఇళ్లు ఎదురెదురుగా ఉండడంతో పరిచయస్తులు. కాగా, తన భార్య రమకు సరిత మాయమాటలు చెబుతుండడంతోనే రోజు గొడవలు జరుగుతున్నాయని, ఈ గొడవల కారణంగానే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని సురేష్, కుటుంబ సభ్యులు సరితను అసభ్యకరంగా దూషించారు. దీంతో మనస్తాపం చెందిన సరిత శనివారం ఉదయం క్షణికావేశంలో వెంట్రుకలకు వేసుకునే కలర్ తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. వైద్యుల సూచన మేరకు కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది.

కేసు నమోదు

గాజిరెడ్డి సురేష్ గత ఏడాది కాలంగా తన కూతురు రమను అనుమానిస్తూ చిత్రహింసలకు గురి చేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తల్లి ఒడ్డెటి పోశక్క ఫిర్యాదు చేసింది. గాజిరెడ్డి సురేష్, ఆయన తల్లి గుండమ్మ, చెల్లె పద్మ అవమానకరంగా దూషించడంతోనే తన భార్య దోని సరిత ఆత్మహత్య చేసుకుందని భర్త దోని రాజేందర్ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని మూడు గేదెలు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: లారీ ఢీకొని మూడు గేదెలు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బూర్గుడ సమీపంలో జాతీయ రహదారిపై గేదెలు రోడ్డు దాటుతుండగా మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గేదెకు తీవ్రగాయాలయ్యాయి. గేదెలు చిర్రకుంట గ్రామానికి చెందిన మద్దెల రాజన్నవిగా గుర్తించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

అడవిపంది దాడిలో వృద్ధుడు మృతి

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన గోర్ల బాలయ్య(64) అడవి పంది దాడిలో మృతిచెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య తన బర్రెలను మేపేందుకు రోజు మాదిరిగా గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లాడు. సమీపంలో ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్, LXIII ఆఫ్ 1951 క్రింద నెలకొల్పబడింది)
మంచిర్యాల శాఖ
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
చట్టం క్రింద అనుబంధం IV - రూల్ - 8(1)

సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్‌తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ ఎ.పి. స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు 15-07-2023 తేదీ గల డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తం 30-06-2023 నాటికి రూ. 9.66 లక్షలు (తొమ్మిది లక్షల అరవై ఆరు వేల రూపాయలు మాత్రమే) తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీత **M/s. AMK** ఫంక్షన్ హాల్, డి.నెం. **6-154/A,** సర్వే నెం. **121/A,** తిమ్మాపూర్, ఖానాపూర్ గ్రా।। & మం।।, నిర్మల్ జిల్లా మరియు ఆస్తి యజమాని/ ష్యూరిటీ శ్రీ అబ్దుల్ అమ్జాద్ ఖాన్, తండ్రి అబ్దుల్ వాహెద్‌ఖాన్, డి.నెం. **6-154/A,** సర్వే నెం. **121/A,** తిమ్మాపూర్, ఖానాపూర్ గ్రా।। & మం।।, నిర్మల్ జిల్లా వారిని కోరారు.

రుణగ్రహీతలు/ ష్యూరిటీ సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ ఆమె సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తులను 3 మే, 2024న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/ ఆస్తి యజమానికి మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా 30-06-2023 నాటికి రూ. 9.66 లక్షలు మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొ।।వి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, మంచిర్యాల శాఖ చార్జ్‌కు లోబడి జరుగవలెనని ముఖ్యంగా రుణగ్రహీత/ ష్యూరిటీ ని మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తుల వివరములు :

ఐటమ్ నెం. 1 : దానిపై నిర్మించిన / నిర్మించబోయే భవనాలతో పాటు శ్రీ అబ్దుల్ అమ్జాద్ ఖాన్, తండ్రి అబ్దుల్ వాహెద్‌ఖాన్ కు చెంది ఉండి నిర్మల్ జిల్లా, ఖానాపూర్ (మం।।), కోడ్ నెం. 18, తిమ్మాపూర్ గ్రా।। వద్ద గల సర్వే నెం. **121/a,** ద్వారా కవర్ చేయబడి 6000 చ. అడుగుల జింక్ షీట్ రూఫ్ ఏరియాతో ఫంక్షన్ హాల్ ప్లింత్ ఏరియాతో 4594.72 చ. గజాల విస్తీర్ణం ఏరియాలో నిర్మించిన జి.పి. డి. నెం. **6-154/A** కలిగిన **M/s. AMK** ఫంక్షన్ హాల్‌కు చెందిన భూమి మరియు భవనాలు మరియు తాకట్టు పెట్టిన ప్లాంట్ & మెషినరీ, ఫర్నీచర్ & ఫిక్చర్లు, కిచెన్ ఎక్విప్‌మెంట్, క్రాకరీ & కట్లరీ మొ।।వి.

ఐటమ్ నెం. 2 : దానిపై నిర్మించిన / నిర్మించబోయే భవనాలతో పాటు శ్రీ అబ్దుల్ అమ్జాద్ ఖాన్, తండ్రి అబ్దుల్ వాహెద్‌ఖాన్, నిర్మల్ జిల్లా, ఖానాపూర్ (మం।।), మస్కాపూర్ గ్రా।। వద్ద గల సర్వే నెం. **261,** కోడ్ నెం. 12, ద్వారా కవర్ చేయబడి ఖాళీ ప్లాట్ నంబర్లు 1, 2, 5, 6 ఒక్కొక్క ప్లాట్ విస్తీర్ణం 422.22 చ.గజాలు, ప్లాట్ నెం. 4 విస్తీర్ణం 1017.77 చ.గజాలు మరియు ప్లాట్ నెం. 3 విస్తీర్ణం 544.44 చ. గజాలు, మొత్తం భూమి విస్తీర్ణం 3251.02 చ.గజాలు.

తేది: 03-05-2024 సం/-., అధీకృతాధికారి
ప్రదేశం: మంచిర్యాల (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్)

శాఖ: ప్లాట్ నెం.414, బ్లాక్ నెం.4, ఇన్నరామి నగర్, మంచిర్యాల, సెల్: 8498945680, ఫోన్: 08736-252567
ప్రధాన కార్యాలయం: 5-9-194, చిరాగ్ అలీ లేన్, పి.బి.నం.165, హైదరాబాద్ - 500001
ఫోన్: 9866512501, 040-23201646, 23202550, 23202551, ఫ్యాక్స్: (040)-23202972
ఇమెయిల్: tsfc-gen@tgsfc.in, URL: apsfc.com

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DISTANCE EDUCATION
- SSC/INTER FAIL??? Don't worry Pass from NIOS/OPEN BOARD (One Sitting) JOIN regular Degree Contact: 6301053911, 7989907461 [H-778911]

SERVICES
BUSINESS OFFER
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

WANTED
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185062]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని / వంటపనిచేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-799876]
- అర్జెంటుగా మూతపడ్డ కంపెనీకి వాచ్‌మేన్ సూపర్‌వైజర్ కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన. సర్ సిల్క్ కంపెనీ కాగజ్‌నగర్ జీతం: 6,000/- ఉచిత గృహ వసతి. కుటుంబంతో ఉండవలెను. సంప్ర।। 9440050036/ 7569783139/ 9491824592 [H-778765]
- Wanted Collection Executives, Team Leaders & Tele-Callers to work for Nationalised Banks with DRA Certification. 9177657494, 9348290349 [HA-2384]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,